క్లుప్తంగా

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



పనులు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్

వెల్గటూర్: గుంతల రోడ్డుకు జరుగుతున్న ప్యాచ్‌వర్క్ పనుల్లో నాణ్యత పాటించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వెల్గటూర్ మండలం అంబరిపేట నుంచి ధర్మపురి మండలం రాయపట్నం వరకు 7వ నెంబర్ రాష్ట్ర రహదారిపై రూ.4 కోట్లతో జరుగుతున్న పనులను ప్రభుత్వ విప్‌సోమవారం వెల్గటూర్‌లో పరిశీలించారు. ఆర్అండ్‌బీ డీఈకి ఫోన్ చేసిన ప్రభుత్వ విప్ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని, ఏఈ ఆదిత్యను రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యక్షంగా అందుబాటులో ఉండి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. ఎన్నో ఏళ్లుగా గుంతల రోడ్డుపై ఇబ్బందులు పడిన ప్రయాణికులు రోడ్డు నిర్మాణంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



టీచర్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: ఉద్యోగులు తమ పదవీ కాలంలో చేసిన ఉత్తమ సేవలే వారికి గుర్తింపు ఇస్తాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. హెచ్ఎం చెన్నమదావుని శ్రీదేవి-భాస్కర్ రాజు పదవీ విరమణ కార్యక్రమంలో సోమవారం పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవమైనదన్నారు. అనంతరం శ్రీదేవి దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు నాయకులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం



సంతోష్‌ను సన్మానిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన ఏనుగు సంతోష్ అనే యువకుడు అగ్నిపథ్‌కు ఎంపిక కావడంతో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి సోమవారం శాలువాతో సన్మానించారు. గ్రామీణ ప్రాంత యువకుడు దేశ భద్రతకోసం సేవలందించే అగ్నిపథ్‌కు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, నాయకులు బద్దం మహేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వినోద్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి: మండలంలోని నంచర్లలో ఈ నెల 3న ప్రారంభించే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ, అంబేద్కర్, స్వాతంత్ర సమరయోధుల గురించి ప్రజలకు తెలియజేయాలనే పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వొరుగల శ్రీనివాస్, నాయకులు అనిల్‌గౌడ్, విజయభాస్కర్, ప్రశాంత్, విష్ణు, రవినాయక్, అంజయ్య, తిరుపతి, రాజేందర్, జలపతి, మహేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్రిడ్జ్ వితరణ

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు కొండ వరుణ్, కొండ వందన కలిసి ఆదివారం కూల్ వాటర్ ఫ్రిడ్జ్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జవ్వాజి అశోక్, మాజీ సర్పంచ్ చెక్కపల్లి రఘు అరుణ, బస్వ రాజుల రాజు,ద్యావనపల్లి రాకేష్,గంప ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరిన కొర్కెలు తీర్చే వెన్గుమట్ల వెంకన్నస్వామి

- ఏప్రిల్ 2 నుంచి 4 వరకు జాతర ఉత్సవాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా భక్తుల రాక



శ్రీవేంకటేశ్వర స్వామి మూల విరాట్



ముస్తాబైన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం

గొల్లపల్లి: మండలంలోని వెన్గుమట్ల-బొంకూర్ శివారు గ్రామాల్లోని శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులకు కోరిన కోర్కెలు తీర్చి నిత్యపూజలు అందుకుంటున్నాడు. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం సందర్భంగా చిల్వాకోడూర్ శ్రీ రామలింగేశ్వర సామి జాతర ముంగిపు రెండో రోజు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జాతర ఉత్సవాలు జరుగుతాయి. జిల్లా నలుమూలల నుంచి ఆశేషభక్త జనం ఈ ఉత్సవాలకు తరలివస్తారు. కోరిన కోర్కెలు తీర్చే కొండంత సామి శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తుల పాలిట ఇలవేల్పుగా విరాజిల్లుతున్నాడు. కరీంనగర్‌కు 71 కి.మీ దూరంలో, జగిత్యాలకు 19 కిలో మీటర్ల దూరంలో ఉన్న వెన్గుమట్ల గ్రామంలో సదా జల వాగు ఒడ్డున శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. చుట్టు పక్కల గ్రామాల భక్తులు తమ ఇలవేల్పు దైవంగా ఆరాధిస్తారు.

జాతర విశిష్టత..

ఆలయం ఎదుట ప్రతి ఏడాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణోత్సవం, రథోత్సవం, ఎడ్లబండ్ల ఉత్సవాలు, ప్రత్యేకతను సంతరించుకుంటాయి. మూడు రోజుల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. ఏప్రిల్ 2న స్వామివారి కల్యాణం, పల్లకిసేవ, 3న డోలోత్సవం, 4న శావ, ఉదయం 8 గంటలకు ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముస్తాబైన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం



ముస్తాబైన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం

మల్లాపూర్: భక్తుల కొంగు బంగారంగా కొలువుదీరిన మండలంలోని గుండంపల్లిలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జాతర, కల్యాణమహోత్సవాలను గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. గత నెల 30న శ్రీ విశ్వావసు నామ సంవత్సరాది ఉగాది పండుగతో పాటు గుండంపల్లిలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర మహోత్సవాలు నేడు స్వామి వారి కల్యాణంతో ముగియనున్నాయి. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత తెలిపారు.

సోమేశ్వర కొండపై భక్తుల సందడి

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై సోమవారం భక్తుల సందడి నెలకొంది. శ్రీ కనక సోమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు మల్లాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. దానవేని రాజన్న-లక్ష్మి దంపతులు అందించిన విరాళంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు బల్యాపెల్లి ప్రభాకర్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కారాం, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల టౌన్/మల్లాపూర్/కథలాపూర్/మల్యాల/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/రాయికల్: రంజాన్ వేడుకలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. నెల రోజులుగా పవిత్ర ఉపవాసాలను ఆచరించి సోమవారం ఉపవాస దీక్షలను విరమించారు. మతగురువులు మహ్మద్ ప్రవక్త సందేశాన్నందించారు. ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ముస్లింలు శుభాకాంక్షలు తెలిపారు.



చల్‌గల్‌లో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



రాయికల్‌లో ప్రార్థనలు



కోరుట్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మల్లాపూర్‌లో..



కథలాపూర్ మండలం తాండ్రాలలో..



ఇబ్రహీంపట్నంలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



పెగడపల్లిలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



మల్యాల: రంజాన్ వేడుకల్లో ముస్లింలు

వైభవంగా రామలింగేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్‌లో శ్రీ రామలింగేశ్వర స్వామి డోలోత్సవం, రథోత్సవం సోమవారం కన్నుల పండువగా సాగింది. గ్రామస్తులు,చుట్టు పక్క గ్రామాల భక్తులు తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రథోత్సవం కొనసాగింది. హన్‌మాన్ దీక్షాపరుల పాటలు,నృత్యాలు భక్తుల ఆటపాటలు,సన్నాయి, వాయిద్యాల నడుమ రథోత్సవం కన్నుల పండువగా సాగింది.మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి తిరుపతి,వైస్ చైర్మన్ సింగారపు కొంరయ్య, గందం పరందాములు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న గ్రామస్తులు

మేడిపల్లి: భీమారం మండలంలోని ఈదుల లింగంపేట పరిధిలోని కురుమపల్లె లో శివాలయ వార్షికోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. పురోహితుడు మఠం మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చి శివయ్యను దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగ వెంకటేశం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ రాజిరెడ్డి, జైభీం, జై బాపు కథలాపూర్ కో ఆర్డినేటర్ పుప్పాల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు త్వరలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు



జగిత్యాలలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు త్వరలో ఇళ్లు అందించనున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మోతె కార్యాలయంలో పట్టణానికి చెందిన 90 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాలలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.35 కోట్లు మంజూరు చేశారని, మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 5 వేల ఇళ్లు దాదాపు పూర్తయ్యాయని, 20 వేల మంది ప్రజలు త్వరలోనే ఇందిరమ్మ కాలనీకి వెళ్తున్నట్లు తెలిపారు. నూకపల్లి ఇందిరమ్మ కాలనీని జగిత్యాలలో కలపడం కోసం కేబినేట్ ఆమోదంతో పాటు, గవర్నర్ ఆమోదం తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి, లక్ష్మణ్, శ్రీనివాస్, నాగయ్య పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

పెరిక సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని సంఘం నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బొడ్డు బుచ్చన్న,నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో తొగిటి రాధ ప్రమాదశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.50 వేల చెక్కును, అలాగే రూ.4.50 లక్షల బాండ్‌ను వారి కుమార్తెలు రజిత, రజినిలకు సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు బొడ్ల జగదీశ్, అనిల్, రాము, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రాయికల్: పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పర్యటిస్తున్నట్లు సీనియర్ నాయకుడు గన్నె రాజిరెడ్డి తెలిపారు. రాయికల్‌లో ఓపెన్ జిమ్, మైతాపూర్‌లో పల్లెదవాఖానా, సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం



కొమొరెడ్డి కరంను కలిసిన నాయకులు

మల్లాపూర్: సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, సుప్రీం కోర్టు అడ్వకేట్ కొమొరెడ్డి కరం చంద్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉన్న డిమాండ్లను పరిష్కరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్లకు చట్టబద్ధత, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నెరవేరిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ సేవాదల్ జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన నాయిని సురేష్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కట్కం గంగారెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు, తేలు నరేశ్, జవిడి రాజరెడ్డి, గంగుల శ్రీనివాస్, పుప్పాల వినోద్, నర్సయ్య, రత్నంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు తాగునీరు పంపిణీ



ముస్లింలకు తాగునీటిని పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు

కోరుట్ల: స్థానిక అల్లమయ్యగుట్ట ఈద్గా వద్ద రంజాన్ సందర్భంగా సోమవారం ప్రార్థనలు చేసేందుకు వచ్చిన ముస్లింలకు ఆదర్శ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో తాగునీరు పంపిణీ చేశారు. తమ గురువు అల్లె సంగయ్య జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టామని సభ్యులు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నం అనిల్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, కటుకం మహదేవ్, నర్సయ్య, ప్రసాద్, రాకేశ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామక పత్రం ఇస్తున్న గంగమల్లేశం

పెగడపల్లి: తెలంగాణ చేనేత ఐక్య వేదిక జగిత్యాల జిల్లా కోశాధికారిగా మండల కేంద్రానికి చెందిన బోగ గోపికృష్ణను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల సురేశ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను ఐక్య వేదిక రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు గాజుల గంగమల్లేశం సోమవారం గోపికృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చేనేత కార్మికులను సమన్వయం చేస్తూ ఐక్యవేదిక మరింత పటిష్టతకు కృషి చేస్తానన్నారు.



ఘనంగా వీరభద్ర స్వామి జాతర

మల్లాపూర్: మండలంలోని సాతారంలో శ్రీ వీరభద్ర స్వామి జాతర మహోత్సవాలను సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే రెండో వీరభద్రస్వామి దేవస్థానంగా గుర్తింపు పొందిన సాతారం వీరభద్రస్వామి జాతర ఉత్సవాలకు మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వైభవంగా మల్లన్న స్వామికి పెద్దపట్నం

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్వయంభూ గుండు మల్లన్న స్వామి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఒగ్గు పూజరులతో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. మల్లన్న స్వామి పెద్దపట్నం వైభవంగా నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండాల్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

జగిత్యాలక్రైం:జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద గల బస్టాండ్‌లో అబ్దుల్ వాహిద్ (70) అనే వ్యక్తి మృతిచెందాడు. పట్టణంలోని దగ్గులమ్మ వాడకు చెందిన వాహిద్ గత 7-8 ఏళ్లుగా మంచినీళ్ల బావి వద్ద బస్టాండ్‌లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం అనారోగ్యంతో మృతిచెందడంతో అదే ప్రాంతానికి చెందిన మాజీ కౌన్సిలర్, ప్రజలు ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.